క్లుప్తంగా

ఏడుగురి బైండోవర్

ఆత్మకూరు : గుప్తనిధుల తవ్వకాల కేసులో ఏడుగురిని అరెస్టు చేసి తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రవిరాజు శనివారం తెలిపారు. మండలంలోని కామారం శివారులో గుప్తనిధుల కోసం పలువురు తవ్వకాలు చేపట్టారు.ఈ ఘటనపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి అక్కంపేట గ్రామానికి చెందిన రేగుల దశరథం, కామారం గ్రామానికి చెందిన మోరె నాగరాజు, హనుమకొండకు చెందిన బానోతు గణేష్, చీకటి సూర్యనారాయణ, బోగి వేణు, దండబోయిన సాయితేజ, చెన్నారావు పేట మండలానికి చెందిన రాజులపాటి అంజములును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బైండోవర్ చేసినట్లు సీఐ రవిరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, రమేష్, ఖలీల్ ఉన్నారు.

గంజాయి స్వాధీనం

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి శివారు కెనాల్ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం 2 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గ్రామ శివారులో తనిఖీలు చేపట్టగా 2 కిలోల 300 గ్రాముల గంజాయి లభించింది. అలాగే, ఐదు సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. కాగా ముగ్గురు పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి తహసీల్దార్‌గా రోకుల ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. హనుమకొండ కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి బదిలీపై భీమదేవరపల్లికి తహసీల్దార్‌గా నియమించింది. ఇక్కడ పని చేసిన వెంకటభాస్కర్ పరకాలకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌కు సిబ్బంది పూల బొకే అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తానని చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకే అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా



ఆత్మకూరు : పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌళ్లపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పరకాల : తెలంగాణ రెడ్డి బిడ్డ మాస పత్రిక క్యాలెండర్‌ను పట్టణంలో తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. తెలంగాణ రెడ్డి మాస పత్రిక ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రతినిధి కామిడి సతీష్‌రెడ్డి, సలహాదారుడు మాడుగుల పాపిరెడ్డితో పాటు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బూషి ప్రభాకర్‌రెడ్డి, పోచంపల్లి శివారెడ్డి, కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మాడుగుల మహేందర్‌రెడ్డి, ఏడునూతల గంగాడి మల్లారెడ్డి, చెనుమల్ల సురేందర్‌రెడ్డి, కాంతాల నారయణరెడ్డి, చల్లా ఇంద్రాసేనారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

శాయంపేట : 2024 సంవత్సరం ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితాను శనివారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ఆధ్వర్యంలో బూత్‌లెవల్ అధికారులు విడుదల చేశారు. నూతనంగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారు ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. తప్పులుంటే సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. బీఎల్‌ఓలు రత్నమాల, శ్వేత, సదయ్య పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



పరకాల : దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



కమలాపూర్ : మాట్లాడుతున్న తహసీల్దార్

- ల్యాండ్ పూలింగ్ జీఓ రద్దు చేయిస్తా
- అర్హులందరికీ పథకాలు అమలు చేస్తాం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ముగిసిన ప్రజాపాలన కార్యక్రమం

ఐనవోలు : అధికారం కోల్పోయిన నిరాశతో ప్రతిపక్ష పార్టీల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అపనిందలు మోపుతూ, దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు నమ్మొద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని వనమాల కనపర్తి, పెరుమాండ్లగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మొద్దని అన్నారు. తెలంగాణ సాధన ఏ ఒక్కరి వలనో సాధ్యం కాలేదని, సమిష్టి కృషి వలనే ప్రత్యేక రాష్ట్ర సాకారం అయిందన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాటతీరు అభ్యంతరం కరంగా ఉందన్నారు. ల్యాండ్ పూలింగ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తనకు తెలుసని, త్వరలో జీవో రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని అన్నారు. సర్పంచ్ పిడుగు రజిత, ఎంపీటీసీ మెరుగు రాజేందర్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటరమణ, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారం ముగిసింది. చివరి రోజు మండలంలోని వల్భాపూర్‌లో లబ్ధిదారులు సమర్పించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఎల్కతుర్తి మండలంలో మొత్తం 13,800 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జగత్ సింగ్ తెలిపారు. అలాగే భీమదేవరపల్లి మండలంలో మొత్తం 15,897 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ఐదు గ్యారంటీ పథకాల అమలు కోసం గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలు శనివారంతో ముగిశాయి. మండలంలోని పంగిడిపల్లి, దేశరాజుపల్లి, నడికూడ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగాయి. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చివరి రోజు మూడు గ్రామాల్లో 2,890 దరఖాస్తులు స్వీకరించామని, మొత్తంగా మండల వ్యాప్తంగా 24,000 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చేలికె శ్రీనివాస్, దాసరి రమేష్, వంగ లక్ష్మి, ఎంపీటీసీ సుగుణాకర్‌రావు, ఉపసర్పంచ్ మిట్టపెల్లి సుభాష్, ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ మాధవి, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. మండల వ్యాప్తంగా శనివారం వరకు 9,668 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

పరకాలలో..

పరకాల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. 8 రోజుల పాటు మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా 8,970 దరఖాస్తులు వచ్చినట్లు పరకాల మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తెలిపారు. వీటిలో ఆరు గ్యారంటీ పథకాల కోసం 7,395 దరఖాస్తులు రాగా రేషన్ కార్డుకు 1,575 తెల్లకాగితాలపై దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. చివరి రోజు కావడంతో సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా దరఖాస్తులు స్వీకరించారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు.

ధైర్య, సాహసాలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: యువత ధైర్య, సాహసాలు కలిగి ఉండాలని ప్రవాస భారతీయుడు, అమెరికా న్యూజెర్సీలోని డాక్టర్ రవీందర్ తోట అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనా భవనం సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన విద్యార్థులతో శనివారం జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లక్ష్యం ఉన్నతంగా ఉండాలని సూచించారు. అనంతరం, కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ మాట్లాడుతూ సర్దుకుపోయే గుణం, కష్టపడే మనస్తత్వం కలిగి ఉండాలని చెప్పారు. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి సందర్భం తమ విజయానికి పునాది అని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ సమన్వయకులుగా వ్యవహరించగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీస్ ఇన్‌చార్జ్ రహమాన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం స్పందించాలని, కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అభివృద్ధికి రూ.వేయి కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్‌యాదవ్, జిల్లా సమితి సభ్యులు కుశాల్, నాయకులు జ్యోతిక, అమూల్య, అజార్, కుమార్, రమేష్, హేమంత్ పాల్గొన్నారు.

కేయూ వీసీ రమేష్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న మాచర్ల రాంబాబు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, వీసీ తాటికొండ రాజయ్య నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని న్యూబాయ్స్ హాస్టల్‌లో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల వ్యాపారి వద్ద కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. సమావేశంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, రాష్ట్ర నాయకులు చట్ల సతీష్, గట్టు ప్రశాంత్, కుంట హర్షవర్ధన్, నిఖిల్, సాయికుమార్, ప్రణయ్, శ్రావణ్, మల్లేష్, చంద్రశేఖర్, జగదీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

'ఆర్ట్స్' వలంటీర్లకు మొదటి బహుమతి



వలంటీర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కేయూ క్యాంపస్: సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లా యువజన క్రీడాశాఖల ఆధ్వర్యంలో డిసెంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కేడెట్లు ఉత్తమ ప్రదర్శన నిర్వహించి మొదటి బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారిని శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం

మడికొండ: మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంక్షేమ సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పబ్లిక్ రిలేషన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలకు నవ్య ఎంపిక

విద్యారణ్యపురి: 67వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జనవరి 1న హైదరాబాద్ సైనిక్‌పురిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్‌పోటీల్లో హనుమకొండలోని రామప్ప జూనియర్ కళాశాలకు చెందిన నవ్య పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ఐలి కర్ణాకర్ గౌడ్ శనివారం తెలిపారు. ఈనెల 10న గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో నవ్య పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా కోచ్ అఫ్జల్, నవ్యను అభినందించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గోవాకు బయలుదేరిన రాష్ట్ర దివ్యాంగుల వీల్ చైర్ క్రికెట్ జట్టు

కాశిబుగ్గ: ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు ఇంటర్నేషనల్ గోవా పర్పుల్ ఫెస్ట్‌లో జరగనున్న సౌత్ ఇండియా దివ్యాంగుల వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ దివ్యాంగుల వీల్‌చైర్ క్రికెట్ జట్టు వరంగల్ నుంచి గోవాకు శనివారం బయలుదేరింది. వారిలో వరంగల్‌కు చెందిన దివ్యాంగుడు కొల్లూరి అరుణ్‌జాన్.. జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. కీపర్‌గా మోనుషిక్, వెంకటేష్, శివ, రాంజీ, శ్రీకాంత్, దొరబాబు, సతీష్, శివశంకర్, అశోకం, రాకేష్, మల్లికార్జున్, కోచ్ సదువుల మధు, మేనేజర్ సన్నీ తదితరులు ఉన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



రజనీకుమార్



శంకర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – పాట' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి తెలుగు విభాగం పరిశోధకుడు బి.రజనీకుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అలాగే, 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ వెల్ఫేర్ మీసర్స్ అండ్ రిహాబిలిటేషన్ స్కీమ్స్ ఫర్ విజువల్లీ డిసెబుల్డ్ ఇన్ తెలంగాణ స్టేట్ ఐ ఏ స్టడీ' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిశోధకుడు నిమ్మనగోటి శంకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి పేర్కొన్నారు.

వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేస్తా..



మాట్లాడుతున్న డాక్టర్ పిడమర్తి రవి

హన్మకొండ చౌరస్తా: మాదిగలను మోసం చేసిన బీజేపీ పక్షాన మంద కృష్ణమాదిగ వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిస్తే, తాను కాంగ్రెస్ పార్టీ తరఫున ఇక్కడి నుంచే పోటీ చేస్తానని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. హనుమకొండలోని టీఎన్జీఓఎస్ భవన్‌లో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) అధ్యక్షుడు మైసా ఉపేందర్ అధ్యక్షతన వరంగల్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. ఈమేరకు వరంగల్ పార్లమెంట్ నుంచి పిడమర్తి రవి పోటీ చేస్తే తమ మద్దతు ఉంటుందని ఏకగ్రీవ తీర్మాణం చేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



హన్మకొండ అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని శ్రీచక్ర ఆస్పత్రి ఫౌండర్, చైర్మన్, అడ్వకేట్ కొత్త పెల్లి రాజు, హనుమకొండ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ చల్లా శ్రీనివాస్ అన్నారు. నగరంలోని శ్రీచక్ర ఆస్పత్రిలో వీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీచక్ర ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్లు వీ.ప్రసాద్, గోపినాథ్, ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మోటివేటర్ రచ్చ కల్యాణి, న్యాయవాదులు దేవులపల్లి రాజేష్, మున్నారపు మహేష్, కందుకూరి మోహన్, గంధం రమేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి అన్నకూటోత్సవం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో తొలిసారిగా ధనుర్మాసంలో భాగంగా అన్నకూటోత్సవాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఉదయం నిత్య పూజల అనంతరం గోదా కృష్ణులకు తిరుప్పావై సేవా కార్యక్రమం నిర్వహించి, 22 రోజుల పాశురాన్ని భక్తులచే పఠింపజేశారు. అలాగే స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ప్రతినెల నిర్వహించే పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో విశేష అభిషేకం జరిపించారు. ధనుర్మాసం, అన్నకూటోత్సవం యొక్క విశేషాలను అర్చకులు రవి ఆచార్యులు భక్తులకు వివరించారు. ఉత్సవ మూర్తులు లక్ష్మీనృసింహస్వామి, పద్మావతి, అలివేలుమంగతో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు, అర్చకుడు నారసింహుడి విశేషాలను ఆయనకు వివరించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రానున్న ఐదు సంవత్సరాల్లో ఆలయాన్ని విశేషంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాలను అందించారు. అన్నకూటోత్సవ ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, డైరెక్టర్ మోహన్, కాంగ్రెస్ నాయకులు సమ్మెట మహేందర్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, పైండ్ల సంపత్, కాటబోయిన రవి, పల్లపు రాజు, గుండపు వెంకట్రామ్ నర్సయ్య, అరూరి అశోక్ పాల్గొన్నారు.

రీజినల్ స్థాయికి బాలికల గురుకుల ఎంపిక



విద్యార్థులతో మాట్లాడుతున్న టీం సభ్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వరంగల్ రీజినల్ లెవల్ సంపూర్ణ ప్రాజెక్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి తెలిపారు. గత ఏడాది జూన్ నుంచి 2024 జనవరి వరకు పాఠశాలలో జరిగిన ఆక్టివిటీస్‌పై అబ్జర్వేషన్ చేసేందుకు హైదరాబాద్ నుంచి ప్రాజెక్టు సంపూర్ణకు సంబంధించిన టీం విస్పెస్ దకోటా లీన్ పీటర్సన్, ట్రైనర్ మనీచందన శనివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధి గురించి విద్యార్థులను అడిగితెలుసుకొని తరగతులను పరిశీలించారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి సలహాలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. హెచ్‌ఎం సుభాషిణిదేవితో పాటు ఉపాధ్యాయ బృందం ఉంది.

ఘనంగా ఆంగ్ల ఉపాధ్యాయుల సమ్మేళనం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాలలో కాజీపేట, ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ధర్మప్రకాష్ పాల్గొని మాట్లాడారు. ఆయా మండలాల పాఠశాలల్లో ఉన్నతి, లక్ష్యం ప్రోగ్రాం, 8వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యాంశాల బోధనను వేలేరు రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు సందీప్ కుమార్, భాను ప్రకాశ్ ఆంగ్లంలో బోధించారు. నాలుగు నెలల పాటు అమెరికాకు వెళ్లి విద్యారంగ కార్యక్రమాలను పరిశోధన చేసి అనుభవాలను కోలా రవికుమార్ వివరించారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన శ్రీకాంత్, సాయికిరణ్

కమలాపూర్ : మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈనెల 10వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని కానిపర్తికి చెందిన ధర్ముల శ్రీకాంత్, ధర్ముల సాయికిరణ్ ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిద్దరు ఇప్పటికే జూనియర్, సీనియర్, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పలుమార్లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ధర్ముల శ్రీకాంత్, ధర్ముల సాయికిరణ్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కానిపర్తి బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారులు దాసరి రమేష్, సందెల కుమార్, కన్నెబోయిన కిరణ్‌తో పాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గ్రామదేవతల ప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితులు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు గ్రామంలో వేదపండితుల మంత్రోచ్చరణలు, భక్తుల ఆధ్యాత్మిక పారవశ్యం నడుమ శ్రీపరమేశ్వర దివ్య శివలింగ సహిత గణపతి, గ్రామదేవతాల ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, సర్పంచ్ బొల్ల నరేష్, దాతలు, భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆంజనేయులు

హసన్‌పర్తి: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఆంజనేయులు సూచించారు. కిట్స్ వరంగల్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ హెచ్‌ఆర్‌డీ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ సహకారంతో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఐడియా థాన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సాంకేతిక రంగానికి సంబంధించిన వినూత్న ఆలోచనలను రూపొందించేందుకు, అత్యంత సంక్లిష్టమైన వాటిని పరిష్కరించేందుకు ఉచిత సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆవిష్కరణల కోసం సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడం ఈ ఈవెంట్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ శంకర్, ప్రొఫెసర్ నర్సింహారావు, డాక్టర్ విజయ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకరాచారి, విద్యార్థి ప్రతినిధులు జైద్, సాథ్విక్, నితీష్, రిషిత్, శశి, వర్షిత, స్నేహ, అద్విక్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.